


# ఫలించని పరిశోధన

రచన: జి. టి. రెడ్డి

అపరాధ పరిశోధనయం దారితేరి దేశం నలుమూలలనుంచి యెడతెరిపిలేని గౌరవ బిరుదాలందుకున్న ప్రఖ్యాత డిటెక్టివ్ దామోదరం గదిలో సోఫామీద కూర్చొని పైన తిరుగుతున్న పంకావంక చూస్తూ చూస్తూ అగస్మాత్తుగా కళ్ళు మూసుకున్నాడు. అనగా ఆలోచనల వూబిలోనికి అమాంతంగా దుమికేశాడన్నమాట. చేతివ్రేళ్ళమధ్య నిప్పుతో పట్టుబడివున్న సిగరెట్టు సన్నంగా పొగ చిమ్ముతోంది.

మొదటికేసు "తాటితోపులో తలకాయ" చేపట్టి నిండా నాలుగు దినాలైనా కాలేదు. ఇప్పుడు మరో కేసు "ఒడిలో కనబడినశవం" వచ్చిపడింది. తొలికేసుకు సంబంధించిన నేరస్థులు అందీ అందకుండా తప్పించుకు తిరుగుతున్నారు. ఇక యీ రెండో కేసు సందర్భంలో తను ఎదుర్కొవలసిన ప్రమాదాలు యెటువంటివో! అంతా అయోమయంగా వుంది. ఎటుచూచినా తనొక్కడే కన్పిస్తున్నాడు. నెలరోజులక్రితం "సానిదాని ఖూనీ" కేసు పరిశోధనసమయంలో తీవ్రమైన గాయాలకు గురి అయిన అసిస్టెంటు ఆనందం యింకా హాస్పెటలు మంచంపైనే "అమ్మా! అబ్బ!" అంటూ మూల్గుతున్నాడు. అయినా తనేమీ అధైర్యపడలేదు. నిజానికి యిటువంటివి మరో పదికేసులు కట్టగా వచ్చిపడినా తట్టుకునే సమర్థత గలవాడు తను. అందుకనే "ఒడిలో కనబడిన శవం" కేసువిషయంలో చేతకాదని తిరస్కరించడానికి మనస్కరించక సాధించితీరుతానని హామీయిచ్చి ఆ వచ్చిన పెద్దమనిషికి ధైర్యం చెప్పి పంపించాడు. ప్రస్తుతం తను విన్న వివరాలనుమాత్రమే ఆధారంగా చేసుకొని ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. పసందైన తన రూపాన్ని పీల్చి పీల్చి కాల్చి నాశనం చేసినందుకేమో మరి, ఆఖరుదశకు రాగానే సిగరెట్టుపీక కసితీరా కరచి నేలరాలింది.

అదేసమయంలో "ఏవండీ!" అంటూ అర్ధాంగి లీలాబాయ్ గదిలోనికి ప్రవేశించింది. తలలో తిరుగుతున్న ఆలోచనలన్నీ తాత్కాలికంగా పైకి తేలిపోయాయి. మెల్లిగా కళ్ళు విప్పి తేరిపార చూశాడు డిటెక్టివ్ దామోదరం. అతనికి కాస్తదూరంలో భార్య నిల్చొని వుంది. ఆవిడగారి అవతారాన్నిబట్టి వంటింటిలోనుంచి నేరుగా వచ్చినట్టు అతి సునాయాసంగా వూహించాడు. దానికి నిదర్శనంగా సదరు (పాకశాస్త్రం తాలూకు) పరికరం ఒకటి చేతధరించి వుందామె. విశేషమేదో జరిగేవుండాలి. సంగతేమిటన్నట్టు కనురెప్పలు రెపరెపలాడించాడు తమాషాగా.

"ఉదయం పోపుపెట్టెలో పెట్టిన పావలాకాసులు రెండు మాయమైనయి. మొన్ననుకూడా అంతే! కొంగున ముడిపెట్టిన రెండణాలుకంటికి కానరాకుండా పోయాయి. ఇలాగైతే ఏలా చెప్పండి? ఈవాళ అర్ధరూపాయి అయింది సరిపోయింది. రేపు పాతిక, ఆ తర్వాత వంద అవుతుంది. మొక్క......"

భార్య మాట పూర్తి కాకుండానే "మొక్కతొక్కమాటకేంగాని, యిప్పుడు నన్నేం చేయమంటావో చెప్పదూ?" అన్నాడు కాస్త చిరాకును ప్రదర్శిస్తూ దామోదరం.

"ఏం చేయమంటానూ? మొక్కదశలోవున్నప్పుడే లొంగదీయాలంటాను. ఈవేళ తోటకూరదొంగ రేపు కోటలో దూరడనే నమ్మకమేమిటి? ఇంటగెలిచి రచ్చగెలవమన్నారు పెద్దలు. ఎక్కడో దోపిడీలు, ఖూనీలు జరిగాయని తెలిస్తే రెక్కలు కట్టుకుయెగిరిపోతారు. స్వంత యింటివిషయం కొంచెమైన పట్టించుకోరు" మహాబాధపడుతూ అంది భార్య.

"నీ ధర్మమంటూ యింటివిషయం పట్టించుకోనంత బుద్ధిహీనత నాకింకా అబ్బలేదు. తప్పనిసరిగా అవసరమని తోచినప్పుడు ఏ విషయంలోనైనా నా అంతట నే జోక్యంకలిగించుకుంటాను. తీగలాగితే డొంకంతా కదులుతుంది. పనికిమాలిన ప్రసంగాలతో కాలంవ్యర్థం చేయడం నాకిష్టంలేదు. నీ వనేదేదో సూటిగా తెలియజేస్తే సంతోషిస్తాను."

"లేకపోతే విచారిస్తారు అంతేనా?"

"విచారించనుకాని ఎందుకూ పనికి రాకుండా కాలం వృథాగా గడుస్తున్నందుకు చింతిస్తాను. ఎందుకీ వాద ప్రతి వాదనలు? ఇంతకీ నీ వనేది ఆ పావలా కాసులదొంగనుపట్టుకోమని "అవునా?" తప్పించుకోవాలనుకున్నా తప్పనట్టు లేదు. కేసును పరిష్కారానికి తీసుకోవటంకంటే వేరే గత్యంతరం లేక పోయింది డిటెక్టివ్ దామోదరానికి.

"అవును" అంది లీలాబాయ్ ముక్తసరిగా.

"అవునయితే ఆమాట మొదటే చెప్ప లేదేం? ఈసరికి దొంగను పట్టి అప్పగించేవాడినే! ఇప్పుడైనా మించిపోయిందేమీ లేదు గాని నేను రెండే రెండు ప్రశ్నలు వేస్తాను. సమాధానాలు సరిగా చెప్పావో దొంగను అయిదు నిమిషాల్లో అతిసునాయాసంగా పట్టేస్తాను" చిటిక వేశాడు దామోదరం.

"సమాధానాలమాట దేవు డెరుగు. అవతల పొయ్యిమీద కూరపెట్టివచ్చాను అది కాస్త మాడివుంటుంది" అంటూ భార్య లీలాబాయ్ వంటింటివేపు అడుగు వేసింది.

"కూర - నార అంతా ముగించుకొని త్వరగా రా. ఇదేదో పూర్తి పరిష్కారం కానిదే నా అసలు కేసులజోలికిపోడానికి వీలుండదు" సోఫావెనుకకు వీపుమోపి కళ్ళుమూసుకున్నాడు దామోదరం.

పావుగంట గడిచాక చీరకొంగుకు చేతులు తుడుచుకుంటూ లీలాబాయ్ రానేవచ్చింది. "ఏంవండీ! ఏవో ప్రశ్నలన్నారు?" అంటూ భర్తకు ఎదురుగా వేరొక సోఫాలో కూలబడింది.

కళ్ళుతెరచి కాస్త ముందుకు వొంగి కూర్చున్నాడు దామోదరం. "అనడం యేమిటి! నీ రాక కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. సరే, అయితే ఆపావలా కాసులు పోపుపెట్టెలో ఎన్ని గంటలకు పెట్టివుంటావు? తిరిగి అవి అందులో లేనట్టు యెప్పుడు తెలుసుకున్నావు? దొంగను పట్టుకునేందుకు యీ టైము చాలాఅవసరమన్నమాట మరచిపోకు."

"మీ తెలివి తెల్లారినట్టే. వంటింటిలో గడియారం లేదని తెలిసికూడా అలా అడిగితే నేనేం చెప్పను?"

"అందుకే ముందే చెప్పాను. అడిగినప్రశ్నకు సమాధానం సూటిగా వుండాలని. అరగంట వెనకాముందు అయినా పర్వాలేదు. బాగా ఆలోచించు చెప్పు."

"అదేమో అదంతా నాకు తెలియదు గాని ఒకటిమాత్రంచెప్పగలను కాఫీలో పంచదార కలిపేముందు పావలా కాసులు రెండూ అందులో పెట్టాను. ఆ తర్వాత వెంటనే బాబ్జీతో మీగదికి కాఫీ పంపించాను. ఇందాక మీ గదికివచ్చే ముందు అందులో లేనట్టు తెలుసుకున్నాను. గదిలో గోడకు గడియారం వుంది. మీ చేతికికూడా వాచీ వుంది. ఆయాసమయాల్లో టైమెంతై వుంటుందో మీరే నిర్ణయించాలి" అంది నవ్వుతూ లీలాబాయ్.

దామోదరం ఒక్క క్షణం కళ్ళు మూసుకొని ఆలోచించాడు. "అవును సుమా! యిప్పుడు జ్ఞాపకమొచ్చింది. కాఫీత్రాగి ఖాళీకప్పులు క్రిందపెడుతున్నప్పుడు గోడగడియారం తొమ్మిది కొడుతోంది. బహుశా నీవు నా గదిలోనికి వచ్చేసరికి టైము పదిన్నరకుపైనే అయివుంటుంది. దీనినిబట్టి ఆలోచిస్తే ఎనిమిదిన్నర పదిన్నరకుగల మధ్యకాలంలో ఆ పావలా కాసులు దొంగిలించబడ్డాయని తెలుస్తోంది. అయితే యీమధ్యకాలంలో యింట్లోవున్న వాళ్లెవరెవరు? దీనిని మన మీవిధంగా తర్కించుకోవచ్చు. మొత్తం యింట్లోవున్నవాళ్ళు (మనలను తప్పించగా కన్పిస్తున్నవాళ్లు) అయిదుగురు. బాగా ఆలోచిస్తే పెద్ద బ్బాయిని, అమ్మాయి లక్ష్మిని అనుమానించలేం. ఎందుకంటే వాళ్ళిద్దరు ఉదయం ఏడు గంటలకు స్కూలుకు వెళ్ళారు. ఇంతవరకు తిరిగి రావటమే లేదు. ఇక మిగిలినవాళ్లు ముగ్గురు. పనిమనిషి, బాబ్జీ, పాప. నీ ఆచార వ్యవహారాలనుబట్టి పనిమనిషి వంటింటి గడపత్రొక్కడానికి రవ్వంత అవకాశమూ లేదు. పోతే అనుమానించతగ్గవాళ్లు బాబ్జీ, పాప. ఒకవిధంగా చూస్తే బాబ్జీని కూడా అనుమానితుల జాబితాలోనుంచి కేటాయించడం సబబుగా తోస్తోంది. నిన్నట్నించి రెండణాలకోసం నా ప్రాణం కొరుక్కుతిన్నాడు. ఇప్పుడే వాడికి రెండణాలు యిచ్చాను. బెలూన్ కొంటానంటూ బజారుకి పరుగెత్తాడు. నిజంగా వాడు అర్ధరూపాయి దొంగిలించివుంటే ఒక రెండణాలకోసం నా వెనుక తోకలా తగిలే అవసరముండదు. ఏం అర్ధమైందా?" అంటూ నవ్వుతూ భార్య ముఖంలోనికి చూశాడు కేవలం తొక్కుడ జ్ఞానంతోనే దొంగను నిర్ణయించిన డిటెక్టివ్ దామోదరం

"అవునవును! యిప్పుడు నాకూ తెలిసింది అందుకనే చదువుకుంటాననే నెపంమీద వంటింటిలో ఎక్కాలు వల్లిస్తు కూర్చొందిపాప. వేలెడంతలేదు. అప్పుడే యిటువంటి దొంగబుద్ధులైతే కాస్త పెరిగి పెద్దయాక మరీ మితిమీరి పోతుంది. ఇంటికిరాని దానిపనిచెప్తాను. వీపు చిట్లగొడతాను" అని కోపంతో కళ్లు, పళ్లు బిగించి లేచినిల్చుంది లీలాబాయ్.

"ఇంతకంటే అధికం తెలిసి యేడిస్తేగా! ఎంతసేపు కొడతాను తిడుతాను అంటావేగాని మంచిగా చెప్పి బుద్ధి మార్చాలని తెల్సుకోవు. ఈవిషయంలో నీవేమీ తొందరపడి జోక్యంచేసుకోకు. నిజం పాపనోటితోనే చెప్పిస్తాను. అదుగో

పెద్దవాళ్లు కూడా వచ్చినట్టున్నారు. నువ్వికవెళ్ళి అందరికీ ఒకేసారి భోజనాలుపెట్టు అక్కడే దొంగను అందరి మధ్య నిల్చోపెడతాను."

వంటింటి వసారాలో అందరు భోజనాలకు కూర్చున్నారు. రామం, లక్ష్మి, బాబ్జీ, పాప ఒక వరుసలోను తండ్రి దామోదరం వాళ్లకెదురుగాను కూర్చొని మౌనంగా తలలు వంచుకొని భోజనాలు చేస్తున్నారు. ఉన్నట్టుండి దామోదరం ఒక్కసారి గొంతెత్తి అన్నాడు. "ఈవేళ ఉదయం మీ అమ్మపోపుపెట్టెలో రెండు పావలాకాసులు వుంచింది. పది గంటలకుచూస్తే అవి అగదులోలేవు. తీసిన వాళ్లెవరో నాకు తెలుసు. తీసినవాళ్ళు నిజంచెప్పి ముందుకొచ్చి యీ రూపాయి తీసుకొండి" అంటూ ఒక యిచ్చు రూపాయి క్రిందపెట్టాడు.

ఎవరూ నోరు మెదపలేదు. అందరూ అయోమయంగా చూస్తున్నారు తండ్రి ముఖంలోనికి. మళ్ళీ దామోదరమే అన్నాడు "నిజం చెప్పితే యీ రాత్రికి సినిమాకు కూడా తీసుకువెళతాను" అంటూ మరొక ఆశ చూపించాడు.

అప్పటికీ ఎవరు ముందుకు రాలేదు. బాబ్జీమాత్రం కళ్ళముందు కన్పిస్తున్న రూపాయిని చూస్తూ ఏమిటో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. గబగబలేచి ముందుకొచ్చి "నాన్నా! నేను తీశాను" అని నవ్వుతూ రూపాయి నందుకోబోయాడు బాబ్జీ.

"ఏదీ చూపించు" అంటూ క్రిందనున్న రూపాయిని చేతిలోనికి తీసుకున్నాడు తండ్రి.

"ఉఁహుఁ, ముందు రూపాయి నాకిస్తే చూపిస్తాను" అన్నాడు బాబ్జీ రూపాయిని చూస్తూ.

"లేకపోతే చూపించ వన్నమాట!" లీలాబాయ్ గరిటను చేతిలోనికి తీసుకుంది.

తొందరపడవద్దని భార్యకు కనుసైగ చేసి బాబ్జీచేతికి రూపాయి అందించాడు దామోదరం. ఉండండి! తెస్తానంటూ బాబ్జీ పరుగెత్తుకొని వెళిపోయాడు.

అయిదు నిమిషాలయాక బాబ్జీ జంకుతూ వచ్చాడు. తండ్రి చేతికి అందివ్వడానికిభయపడి పావలాకాసులు రెండు అక్కయ్యచేతిలో పడేసి పారిపోయాడు బాబ్జీ. దామోదరం భార్య ముఖంలోనికి నవ్వుతూ చూచాడు. లీలాబాయ్ కళ్లతో పాపను చూపిస్తూ పెదవి విరిచింది. దామోదరంముఖం చిన్నబోయింది. మొదట తను అనుమానించింది ఏ పాపమూ ఎరుగని పాపను. ఇప్పుడు బాబ్జీ దొంగని తేలింది. ఏలాగైతేనేం, భార్యకు మాటిచ్చిన ప్రకారం తను దొంగను పట్టుకున్నాడు. పోతే అర్ధరూపాయి కోసం రూపాయి ఖర్చు అయింది. అయినా పైవాళ్లెవరు? ఏదో విధంగా తనకుతానై సరిపెట్టుకున్నాడు దామోదరం.

ఈ పరిశోధనమూలంగా భోజనాల దగ్గర చాలా ఆలస్యమైంది. దామోదరం గాబరాగా తింటున్నాడు. పళ్ళ మధ్య గట్టి వస్తువేదో తగిలింది. నెమ్మదిగా వెలుపలకు లాగిచూశాడు. ఇంకేముంది? పావలాకాసు! దామోదరం కొయ్యబొమ్మలా తయారయాడు.

"ఏమైందండీ?" లీలాబాయ్ గాబరాపడింది. అప్పుడే భోజనాలు ముగించిన రామం, లక్ష్మి తండ్రిని సమీపించి ఆశ్చర్యంతో చూస్తున్నారు.

"ఆ పావలా నానోట్లోకెలావచ్చింది?" అని దామోదరానికి మతిపోయింది.

"మీదంతా విచిత్రం గాని, నోట్లోకి పావలాకాసు రావటం యేమిటండీ?" అని లీలాబాయ్ నవ్వింది. "ఇదుగో చూడు!" అని దామోదరం పావలా కాసు చూపించాడు. అవును నిజమే! లీలాబాయ్ ఆశ్చర్యపోయింది. రెండవది వెదకగా పప్పుపులుసుగిన్నెలో దొరికింది. వంటిల్లంతా నవ్వులతో నిండిపోయింది.

"ఏమిటో నా కిదంతా ఆశ్చర్యంగా వుంది" అన్నాడు దామోదరం ఆలోచిస్తూ.

"ఆశ్చర్య మెందుకునాన్నా ? అమ్మ పోపుగింజలతో కలిపి పావలాకాసులను కూడా నూనెలో వేయించింది" నవ్వును ఆపుకుంటూ కుమార్తె లక్ష్మి అంది.

"అయితే మరి, బాబ్జీకి ఆ రెండు పావలాకాసు లెక్కడి వంటావ్?" అన్నాడు తండ్రి.

"ఆ విషయం వాడినే అడగాలి" అని లక్ష్మి అంటుండగా రామం పరుగెత్తుకుంటూ వచ్చి "నాన్నా! బాబ్జీ గదిలో వున్నాడు. రమ్మంటే రాకండా వున్నాడు. మీ రిచ్చిన రూపాయి దుకాణంలో మార్చి మీచేతికి రెండు పావలా కాసు లిచ్చాడట. మిగిలిన అర్ధ రూపాయితో డిటెక్టివ్‌నవలకొన్నాడు. ఇదుగో" అంటూ చూపించాడు పుస్తకాన్ని.

"మొత్తానికి మనందరి కళ్ళల్లో దుమ్ముకొట్టాడు బాబ్జీ" అని నవ్వుతూ పుస్తకాన్ని అందుకున్నాడు. అట్టమీద బొమ్మ చెడకుండా పుస్తకానికి అట్టవేసి వుంది. పుస్తకం విప్పి మొదటి పేజీ చూశాడు దామోదరం అంతే! అది క్రిందజారిపడింది.

దానిపేరు "మోసపోయిన నాన్న".

★